# అభివృద్ధి

వీటెమ్మ... గబ్బునాయాలు కోళ్లు. అప్పుడే కూతేస్తాండాయి. ఒగటి కూతేస్తే చాలు. మిగిలినోటియన్నీ కూతేస్తాయి, ఈటెబ్బ సొమ్మంతా ఎవురో తీసకపోతాన్నెట్టు ఒగటే కూతలు. చలిచలిగా ఉండాది. చలికి కోన్ని కోసి, పులుసు చేసుకోని, ఉడుకుడుగ్గా సద్ద సంగటిలో అద్దుకోని తింటే... అబ్బా, బలే ఉంటాది. గుడ్లు పెట్టే కోడి బాగుంటాదా..., కోసపుంజు బాగుంటాదా. రెండూ బాగానే ఉంటాయి. దెగ్గిర్లో సంకురాతిరి ఉండాది. వంగిమళ్లోళ్ల పల్లికాడ మామిడి తోపులో కోడిపందెం ఇంగా పెట్టలా. ఇంగ పెడతారేమో. కోడి పందేనికి పోవాల. నూతన కాలవ సుగాలోల్లు కాంచిండే సారాయి తాగి, వగల్ల సాయిబుకాల్చే మిరపకాయ బజ్జీలు తింటా, కోళ్లు తన్నుకునేది చూస్తాంటే ఎంత బాగుంటాదో. దానెక్క... ఆట్నించి రాబుద్ధే కాదు. కోళ్లు కూతేసేది ఆపేసినాయే. ఇంగా తెల్లారలేదేమో. బీడీలయిపోయినాయి. నోరంతా తిమ్మిరిగా ఉండాది. దిగవీధి ఎంగటమామను నిద్రలేపి బీడీ అడిగితే... ఇంత రాత్రికాడ ఏందివాయ్ అంటాడేమో. ఇంగా కొంచేపు పొనుకుంటే బాగుండు. ఒళ్లంతా పచ్చిపుండు మాదిరిగా ఉండాది.

"ఎంచేపు పొనుకుంటావు. చుక్క చూడు ఎంత పైకి వచ్చిండాదో. కోళ్లు కూసి ఎంచేపాయనుకున్నేవు. ఇంకొంచేపుంటే తెల్లారిపోతాది. లే... లేయ్... నువ్వు లేసి ముక్కిమూలిగి ఎలబారేలకు ఈన్నే తెల్లారిపోతాది. కమ్మారపల్లెకు పొయ్యాలకు అన్నమేల అయితాది. పొద్దు పుట్టకముందే పనిలో దిగాలని చెప్పలా వోళ్లు" అరిచింది పార్వతమ్మ.

నిండుకు కప్పుకోనుండే కంబళిని తీసి భార్యవైపు చూసినాడు శివయ్య. గుడ్డిగా వెలుగుతా ఉండే దీపం కాంతిలో భార్యముఖం సరిగా కనిపించలేదు.

"ఏందే... సరిగా నిద్రపోనిచ్చేటిగా లేవే. ఇంకొంచేపు పొనుకుంటే నీ యబ్బగంటేం పోతాది?" అన్నాడు పడుకునే.

"మేము పాయంలో ఉన్నెప్పుడు ఏ పొద్దన్నా మాకు పనుల కాలంలో నిద్దర పడతాన్నిందా? ఎంతసేపూ పనిమిందే కదా లోకమంతా. ఏ వూర్లో పనుండాది. ఎన్నిరోజులుంటాది. ఎంత బిన్నే పనిలోకి పోదాము అనుకుంటా ఉండే వోళ్లం. ఎంత ముందుగా పనిలోకి పోయి, ఎంత ఎనక పనికాన్నించి వస్తే అంతబాగా చూసుకుంటారు మనల రైతులు.

అందరికన్నా అరముద్ద సంగటి ఎక్కువ పెడతారు. తెల్లారిందాకా కాళ్లు నిగడదన్నుకోని పొనుకోనుంటే మనమేమన్నా బూములుండే వోళ్లమా... ఇంత సోంబేరి నా కొడుకును నేనేడా చూళ్లేదు సామీ"

"నిద్రపడక లెయ్యక ముందే నీ గొణుగుడు మొదులు పెట్టినావా... చలికి ముడుక్కోని పొనుకోకుండా ఇంత పద్దన్నే ఎందుకు లేసినావు..." అనరస్తా కంబళిని విసిరికొట్టి లేచినాడు శివయ్య. జారిపోయిండే లుంగీని తీసి నడుముకు బిగించి కట్టుకోని చుట్టింటి తలుపు తీసుకోని బయటకు వచ్చినాడు. చూరుకింద గోడమీదుండే టైరుచెప్పులు తీసి ఏసుకోని గబగబా నడుచుకుంటా పొలాల వైపు పోయినాడు.

ఎంచేపు... కమ్మారపల్లెకే కదా. మూడు మైళ్లు పెద్ద దూరమా? ఈ పొద్దు, రేపు కోసేస్తే ఐపోతాది. రేపు కుప్ప కొట్టాలంటారేమో. వాళ్లదయిపోతానే నాయుడి మడి కూడా కొయ్యాలన్నేడు. అదెన్ని రోజులు పడతాదో. అమ్మ సచ్చిపోయి ఎన్ని రోజులయితాండాది. నిరుడు సంకురాతిరి పోయినాంక నెలకంతా పాణం పోయింది. సంవచ్చరం అయితాండాది. సంకురాతిరికి గుడ్డలు పెట్టాల. దానికి చీర కొనాల. సిల్కు చీర కావాలంటాన్నింది. సిల్కుచీరకట్టందే ముడ్డి నిల్చేటిగా లేదు. కూలికి పొయ్యేవోళ్లకు ఎందుకే అట్లా చీరంటే ఇనదు. నేనుగూడా పాలిస్టర్ పంచె తీసుకోవాల. పాలిస్టర్ పంచె కట్టుకోని సిగరెట్ తాగతాంటే రెడ్డిమాదిరిగా ఉంటా. థూత్... రెడ్డి మాదిరిగా వద్దు. దొంగనాయాలు. జనాలను బలే ఏమారస్తాడు. దసరాబుల్లోడులో నాగేస్వర్రావ్ మాదిరిగా ఉంటా. ప్రేమనగర్‌లో నాగేస్వర్రావ్ మాదిరిగా సూటూబూటూ ఏసుకుంటే. చేతిలో బంగేకు గొట్టం పట్టుకోని తాగతాంటే... ఆహాఁ సొర్గం కదా... నిజంగా రంభా ఊర్వసులుంటారా.... ఎట్లుంటారు.... ఎవురన్నా చూసింటారా...

పల్లెముందర ఉండే గుట్టకాన్నించి నక్కల వూళలు వినిపించాయి.

గబగబా ఇంటికి వచ్చినాడు శివయ్య. బొగ్గుతో పళ్లు రుద్ది పెరట్లో భార్య తోడిన వేడినీళ్లతో స్నానం చేసి వచ్చినాడు. రాత్రి మిగిలిన అన్నంలో నీళ్లు ఉప్పు వేసి కలిపి ఒక గ్లాసులో పోసి భర్త చేతికి యిచ్చింది పార్వతమ్మ.

"చలిగా ఉండాదే... కొంచెం ఉడుకన్నం తింటానే.." అన్నాడు శివయ్య సద్ది తాగతా.

"నీ కోసరమే ఉడుకన్నం చేసిండేది... బిడ్డలు పద్దన్నే లేస్తే ఏం తింటారు? ముసిలాయన ఉండాడు. మనం ఇప్పుడు పోతే రాత్రికి ఎప్పుడో వస్తాం. వాళ్లకున్నీ. మల్ల మద్దేన్నానికి చాలదు" అంటానే మట్టిపాత్రలోనించి చిప్పగరిటతో అన్నం తీసి సత్తుగిన్నెలో వేసింది. వంకాయ పూరిమిండి కొంచెం వేసి భర్త చేతికి యిస్తా "కూర తక్కువ తిను. పిల్లోల్లకు చాలదు. అన్నమేల సంగటి పెడతారు కదా. ఆడ తిందువులే" అంది పార్వతమ్మ సత్తుగ్లాసును కడుగుతా.

అన్నం పొగలు కక్కుతా ఉన్నా శివయ్య గబగబా తినేశాడు. దుప్పట్లో దూరుకోన్నున్న ఐదేళ్లలోపు వయసున్న కొడుకులను ఇద్దర్నీ చూసి తుండుగుడ్డ భుజంమీద వేసుకుని వీధిలోకి వచ్చాడు.

దీపం ఆర్పేసి వీధిలోకొచ్చి "పిల్లోల్లను కనిపెట్టుకోనుండు మామా... గుట్టకల్లా పోనీబాకు. ముగ్గురూ ఏలకింత తిని ఇంటికాన్నే ఉండండి. నువ్వు అప్పర్‌సాబ్‌కాడికి బంగేకు తాగేదానికి పోవద్దు. మళ్లా రాత్రంతా దగ్గతా ఉంటావు" అని పంచమీద గోతంపట్టపైన పాత కంబళి కప్పుకోని పడుకోనుండే మామకు జాగ్రత్తలు చెప్పి భర్త వెంట బయలుదేరింది పార్వతమ్మ.

మారేళ్లనించి ఇద్దరూ పడమర వైపుండే కమ్మారపల్లెకు నడక మొదలుపెట్టినారు.

శివయ్యకు ఇరవై ఐదు సంవత్సరాలుంటాయి. స్వంత పొలమంటూ సెంటుకూడాలేదు. చిన్నప్పటినుంచి కాయకష్టంతోనే బతుకుతా ఉండటంతో కండలు తిరిగి బలిష్టంగా ఉండాడు. పొడవూ కాదు పొట్టీకాదు. నల్లగా నిగనిగలాడే శరీరం. పోతపోసిన కంచు విగ్రహంలా ఉంటాడు. పార్వతమ్మ అతనికి తగిన జోడీ. పనుల్లో కానీ, ఆలోచనల్లో కానీ. భర్తకన్నా ఎక్కువ కష్టజీవామె. భర్తతోపాటు పగలంతా పనిచేస్తుంది. ఇంటికొచ్చింతర్వాత రాత్రి, పొద్దున వంటపని ఎప్పుడూ ఉండనే ఉంటుంది. అయినా తను పని చేయలేనని అనడం కానీ, వంట్లో నలతగా ఉండాదని కానీ పెళ్లయిన పదేళ్లనించి ఏనాడూ అనలేదు పార్వతమ్మ. వాళ్లకు ఒకరంటే ఒకరికి ప్రాణం.

పడమర దేవరకొండ మింద చంద్రుడు పదిబారల ఎత్తులో ఉండాడు. తూర్పున ఆకాశం ఎరుపురంగు పులుముకుంటా ఉంది.

"నాలుగు రోజులు పనిచేసినాం కదా. రేపు చేస్తే ఐపోతాది. ఎంతొస్తాది కూలి."

"ఆమాత్రం తెలీదా... నాకు రోజుకు ఐదు రూపాయలు, నీకు ఏడు రూపాయలు. అంటే రోజుకు మనకు పన్నెండుకదా. ఐదు రోజులంటే. ఐదుపది రూపాయలు యాబయి, ఐదు రెండు రూపాయలు పది కదా. పది, యాబయి కలిపి అరవై"

"ఇంట్లో ఎంతుండాదే... నూరుండా"

"యాట్నించి వచ్చె నూరు. మొన్న మీనాయనకు ఒంట్లో బాగలేకపోతే గర్నిమిట్ట ఆస్పత్రికి పోయాలకు ఐదు రూపాయలు ఐపోలా. తొంబై రెండు రూపాయలుండాది".

"ఇంగా కోతలుండాయి. సంకురాతిరికి మా అమ్మకు గుడ్డలు పెట్టాల. పిల్లోల్లకు కూడా గుడ్డలు కొనాల".

"నాకు సిల్కుచీరా..."

"అబ్బా... కొనుక్కుందాంలేయ్యే... ఒగేళ దుడ్డు తక్కవయినా ఐదో పదో కావాలంటే గుడ్డలశెటి అప్పు యిస్తాడులే"

ఆలూమగలు మాటలు చెప్పుకుంటూ కమ్మారపల్లెకు చేరేప్పటికి తెల్లవారింది.

## 2

ఈనాలీ... తెల్లారకముందే బొ౦య్...బొ౦య్‌మంటా హారన్ కొడతాడు ఈ డ్రైవరు. ఈనికి రేత్తిరంతా నిద్దర రాదేమో. రేత్తిర్లో బాగా పొద్దుపోయినాంక మారేళ్ల పేటకు వస్తాది బస్సు. తెల్లారిందాకా పొనుకోవచ్చు కదా... కోడికూతకన్నా ముందే హారన్ కొట్టేస్తాడు. మల్లా గంటసేపు నిద్రపోతాడు. మేమంతా నిద్ర చెడగొట్టుకోని లెయ్యాల్నా... పిల్లోల్లను నిద్దరలేపాల. చదువుకోమని చెప్పాల... చదువులేకనే కదా మేము ఇన్ని ఇబ్బందులు పడతాండేది. చదువుకుంటే మాత్తరం ఇబ్బందులు ఉండవా... కమ్మారపల్లెలో ఈ పొద్దు, రేపు చేస్తే పని ఐపోతాది. మళ్ల... ఏం చేయాల? మళ్లకోతలకు, కుప్పగొట్టేదానికి మిషన్లు వచ్చేసినాయి. ఐదారుగాన్లు ఎద్దులుండే రైతులు నాయట్లా వోన్ని పెట్టుకోని చేను దుక్కిలుచేపించుకుంటాండిరి. ఇప్పుడంతా ట్రాక్టర్లే దుక్కులు దున్నతాండాయి. ట్రాక్టరు కొన్నేయన రెండతస్తుల మాడీ కట్టిండాడు. ఎండాకాలమయితే ఇటికసూలలు కోసేదానికి పోవాల. చెనిగి చెట్లు పెరికే పని కాయలు వలిచే పని ఉండాదంతే. సమచ్చరంలో ఎక్కువరోజులు గమ్మున ఉంటాండాం. గంగమ్మ జాతర వస్తాండాది. నాయన చాన్నాళ్లనించి నాటుకోడి తునకలు తినాలంటాండాడు. నాటుకోడి యాడకొంటాం. ఇరవై రూపాయలన్నా పెట్టి ఫారంకోడన్నా తేవాల. పిల్లోల్లుండేపని. చీటీగలు కరిసి చంపతాండాయి. గాలే రావడంలే. చీటీగలు కరసకుండా గుడ్డ కట్టుకోవాలంట. మానం కాపాడుకునేదానికే గుడ్డలు లేకుండా ఉంటే చీటీగలు కరసకుండా గుడ్డ యాట్నించి తెచ్చేది. ఇండ్లకాడ జలజారి గుంతలు ఉండగూడదంట. ఏందో ఈ బతుకు... ఎంత చేసినా ఆడికాడికే ఉండాది. ఎప్పుటికి బాగుపడతామో ఏమో... ఎంత చేసినా తెల్లారేది రాళ్లమడుగు గండికాన్నే. ఇంగా కొంచేపు పొనుకుంటే పోతాది.

“ఏంబా... ఎంచేపూ పొనుకోనే ఉంటావా... బస్సేమన్నా మా మామదనుకున్నేవా...? లెయ్... హారన్ కొట్టి చానా సేపాయ. అన్నం కూర చేసేసిండా. బస్సు తప్పోయిందంటే ఈ పొద్దు పని పోతాది. ఇద్దరికి యాభై ఐదురూపాయల కూలి పోతాది.”

“ఆ బస్సోనికన్నా నసగా ఉండాదే నీ యవ్వారం... రేత్తిరంతా చీటీగలు కరిసి కరిసి సరిగా నిద్రే రాలా. చల్లగా గాలి తోలతాండాది. ఇప్పుడే నిద్ర పట్టింది” అంటా అటుపక్కకు తిరిగి పడుకున్నాడు శివయ్య.

“ఏందో యిపరీత కాలం. ఒగపంటలే, ఒగపనిలే, పెద్దా చిన్నా గౌరవంలే...”

“నీయమ్మా... ముసిలోడా... తినేసి గమ్మున పడుకోవేమీ... ఇంట్లో తినేసి ఉన్నెట్టు కాదు. పొగులంతా ఇటికి సూలలకాడ పని చేస్తే తెలస్తాది. ఎండకు బొగ్గులుమాదిరిగా మాడిపోతాండాం. రేత్తిరయితే ఉచ్చులు రాక చస్తాండాం.” అంటా విసురుగా లేచినాడు.

జారిపోతాండే లుంగీని నడుముకు బిగించి కట్టుకోని హవాయి చెప్పులు వేసుకుని పొలాలకల్లా పోయినాడు.

ఎందుకీ పల్లెలో ఉండాము. ఎన్నేళ్లమింటీ ఉండాము. తాతల కాలంనించీ ఈన్నే ఉండారంట. ఏం సంపాదించినారు. ఉండే దానికి సుట్టిల్లే. అదీ కప్పు ఏసి పదేండ్లయితాండాది. నిరుడు వానలకాలంలో ఇంట్లో ముద్దిపట్టేంత జాగా కూడా లేకుండా తడిసి పోయిన్నింది. ఈ ఎండల కాలంలో కప్పు ఏపించాల. పనిలేనప్పుడు పెద్దకొండకు పోయి బోద కోసుకోని రావాల. వానలు కూడా సరిగా లేవు. బోద కూడా అంతగా లేదు. ఉండే రోంతబోదకు ఎందురో కాపెట్టుకోనుండారు. పెద్దకొండలో పెద్దపులి ఏమయింది. పిల్లప్పుడు కదా బోదకుపోతే ఎదురు పడింది. తాత చెప్పేవోడు. పెద్దపులి ఎదురుపన్నే, సింగం ఎదురుపన్నే, ఎలుగ్గొడ్డు ఎదురుపన్నే... ఊపిరి బిగబట్టి కండ్లు ఆర్చకుండా గమ్మున ఉంటే ఎల్లిపోతాయని. అట్లుండబట్టికదా... అది నన్ను సంపకుండా ఎల్లిపోయింది. అడివంతా కొట్టేసినారు. ఒగ చెట్టు కూడా లేదు. కంప చెట్లుండాయంతే. పులులు కాదు కదా నక్కలు కూడా ఉండవేమో... ఉగాది వస్తాండాది. సంకురాతిరికి అమ్మకు గుడ్డలు పెట్టలా. ఉగాదికన్నా గుడ్డలు పెట్టాల.

బస్సు హారన్ మళ్లీ వినిపించింది. మూడోసారి హారన్ వచ్చిందంటే బస్సు బయలు దేరేస్తుంది. గబగబా ఇంటికి వచ్చినాడు. పళ్లపొడితో పళ్లుతోముకొని స్నానానికి పెరట్లోకి వెళ్లాడు.

“ఏమే... ఇంత చల్లగా ఉండాయి నీళ్లు” భార్యను కేకవేశాడు శివయ్య.

“నీకు నీళ్లు మసల కాగాల. కట్టెలు యాడుండాయని. ఎండాకాలంలో కూడా సలసలకాలే నీళ్లు కావాల్నా. నేనయితే చన్నీళ్లే పోసుకున్నే. బిన్నే నీళ్లు పోసుకోని రా. బస్సు ఎలబారతాది” అంది ఇంట్లోనించే పార్వతమ్మ.

శివయ్య స్నానం చేసి వచ్చి భోజనానికి కూర్చున్నాడు. ఉడుకుడుకు అన్నం పెట్టి పచ్చిపులుసు వేసింది పార్వతమ్మ.

“ఈ ఎండల కాలం సద్ది ఉంటే బాగుంటాది. సద్దిలేదా?”

“సద్దన్నం యాడుందిబ్బా... ఎన్ని దినాలయితాండాది సద్దన్నం మిగిలేంత అన్నం చేసి. ఎంత కష్టమయిపోతాండాది తిండికి. రోజూ నేను అరకడుపుతోనే కదా పడుకుంటాండేది. ఉడుకన్నమే తిను” అంది గుడ్డిగా వెలుగుతున్న బల్బు వెలుతురులో అద్దం ముందు కూర్చుని తల దువ్వుకుంటా పార్వతమ్మ.

“నువ్వు తిన్నేవా?” అన్నాడు అన్నం తింటా శివయ్య.

“వూఁ....” అంది శివమ్మ.

తినిందో తినలేదో అర్థం కాలేదు శివయ్యకు. అట్లని భార్యని రెట్టించి అడిగే ధైర్యమూ

లేకపోయింది. ఒకపూట ఒకమనిషి భోజనం కూడా కష్టమయిన రోజులు వచ్చినాయి కదా అనుకున్నాడు. అన్నం తింటానే పనికోసరం బస్సు దగ్గరకు బయలుదేరబోతూ తెల్లవారుతున్నా ఇంకా నిద్రలేవని కొడుకుల పిర్రలపైన రెండు దెబ్బలు వేసి “ముండనాయాండ్లారా... పొద్దెక్కిందాంకా పొనుకోనుంటారారా... లేసి చదువుకోండి” అన్నాడు శివయ్య.

ఉలికిపాటుగా లేచి కూర్చున్నారు ఇద్దరు పిల్లలూ.

“పద్దన్నే వాళ్లనెందుకు కొడతావు. రేయ్ అన్నం కూర చేసేసినాను. కొల్లోల్ల బాయికాడికి పోయి నీళ్లు తెచ్చి తొట్లో పోయండి. సందేళ వస్తానే నేను తెచ్చుకోలేను. మీ తాతకు అన్నం పెట్టండి. మద్దేన్నం, సందేళ బడికాన్నించి వస్తానే గుట్టకల్లా పోయి కట్టిపుల్లలు ఏరుకోనిరాండి” అని కొడుకులకు పని పురమాయించి భర్త వెంట అడుగులేసింది పార్వతమ్మ.

శివయ్యకు ముప్పై ఐదేళ్లయితాండాయి. పనుల్లేక, వేళకు సరిగా తిండిలేక, ఈ మధ్యే గర్నిమిట్టలో పెట్టిండే మందగట్లో బ్రాందీ తగడం ఎక్కువయ్యి మనిషి బాగా తగ్గిపోయినాడు. పదేళ్ల కిందటి నిగారింపు ఇప్పుడతనిలో లేదు. పార్వతమ్మకు వక్కాకు బాగా అలవాటయింది. రెండు పూటలు అన్నం లేకపోయినా ఉండిపోతుందేమోకానీ ఒకపూట వక్కాకు లేకుంటే ఉండలేక పోతాంది. సరిగా తిండితినక, పనులు ఎక్కువయి, మొగుడు తాగుతాండాడనే దిగులుతో సగం అయింది.

ఐదు నిమిషాల్లో ఇద్దరూ రోడ్డు వద్దకు చేరుకున్నారు. అప్పటికింకా బస్సురాలేదు. పేటలో అప్పుడే బయలు దేరినట్టుంది. బుర్రుమనే శబ్దం వినిపిస్తాంది. ఇంకా ఆరేడుమంది రోడ్డుమీద బస్సుకోసం నిలబడుకోనుండారు. కొంచేపట్లోనే బస్సు వచ్చింది. అందరూ బస్సు ఎక్కినారు. బస్సు కెవిపల్లెవైపు వేగంగా పోసాగింది.

“మనం ఎన్ని దినాలు పనిచేసినామే”

“ఐద్దినాలు కదా. ఈ పొద్దుతో ఆడ పనయిపోతాది.”

“ఎంతొస్తాది”

“నీకు ముప్పై. నాకు ఇరవై ఐదు రూపాయలు కదా. దినానికి యాభై ఐదు. ఈ రోజుతో ఆరు దినాలు పనిచేసినట్టయితాది. ఆరు యాబయిలు మున్నూరు. ఆరు ఐదులు ముప్పై. మున్నాటు ముప్పై రావాల మనకు”

“చార్జీలకు తీసుకోనుండే దుడ్డు”

“ఔను కదా... దినానికి పోనురాను నాలుగు రూపాయలు మనిషికి. మనకు ఎనిమిది రూపాయలు ఐపాయ. యాభై రూపాయలు ముందే తీసేసుకున్నాం కదా. అది పోను ఇన్నూట ఎనభై రావాల”

"ఇంట్లో ఎంతుండాంది?"

"యాడిది ఇంట్లో... మీ నాయనకు నిండా బాగలేకుండా వుంటే చూపిద్దామంటే దుడ్డులేక గమ్మునయిపోతిమే".

"... సంకురాతిరికి కూడా మా అమ్మకు గుడ్డలు పెట్టలా. రెండు వారాల్లో ఉగాది ఉండాది. ఉగాది పండక్కన్నా మా అమ్మకు గుడ్డలు పెట్టాల".

"పిల్లోల్లకు గుడ్డలు కొని రెండేండ్లయితాండాది. ఇస్కూలుకు పొయ్యేటోల్లు కదా. నలుగురిలో గుడ్డలు బాగలేకుంటే ఏం బాగుంటాది. ఉండేటియన్నీ చినిగిపోయిండాయి. అన్నీ మాసికలేసి కుట్టిండేటియే. ముందుగా వాళ్లకు చెరొగ సొక్కాయి, చెరొగ నిక్కరు తీసుకోవాల... మీ నాయన గోసిపాత పెట్టుకోనుండాడు. ఆయనకు కూడా ఒగ లుంగీ అన్నా తీసుకోవాల. కరెంటు బిల్లు వచ్చిండాది." అంది పార్వతమ్మ.

భార్య చిరుగుల చీరవైపు దిగులుగా చూసినాడు శివయ్య. అదెప్పుడో పదేళ్ల క్రితం యిష్టంగా కొన్న చీర. ఐదారేండ్లు పండగలప్పుడు తప్ప ఇంక ఎప్పుడూ కట్టుకునేది కాదు. ఇప్పుడు రోజూ దాన్నే కట్టుకోవాల్సి వస్తాంది. అందుకే అది కూడా చిరిగిపోయిండాది. ముందుగా దీనికి చీర తీసుకోవాల అనుకున్నాడు శివయ్య.

"వారం దినాలమింటి దినమ్మూ వస్తాండారే... యాడ పనిచేస్తాండారు" అని మాటలు కలిపినాడు డ్రైవరు.

"వగళ్లకాడ ఇటికె సూలలు కోసేదానికి పోతాండామన్నా" అన్నాడు శివయ్య.

"అదిగూడా ఈ పొద్దుతో సరికదా" అంది పార్వతమ్మ.

"మళ్లేం చేస్తారు" అన్నాడు డ్రైవరు.

"ఏం చేసేదేముందన్నా... మళ్లా ఎవురన్నా ఇటికలు ఏపిస్తే పనికి పోయేది. లేకుంటే ఇంట్లో ఉండేది. పనులేముండాయి. ఈ వాన సక్కరమంగా కురవక పనులే లేకుండాపాయ. దానికి తోడు ఉన్ని ఒగటి రెండు పనులు ట్రాక్టర్లు చేసేస్తాండాయి కదా" అందుకున్నాడు బస్సులో కుచ్చోనుండే ఒకతను.

"మీకేమన్నా సొంత భూములుండాయా?"

"సొంత భూములా... ఉండేదానికి అంత గుడిసిల్లు ఉండాదంతే".

"అయితే ఇంగా ఎందుకు ఈన్నే ఉంటారు. ఏదన్నా టౌనుకు పోగూడదా. టౌన్లో అయితే ఎప్పుడూ ఇండ్ల పనులుంటాయి. ఆడయితే రోజుకు మొగోళ్లకు యాభై ఇస్తారు. ఆడోళ్లకు నలభై ఇస్తారు" అన్నాడు డ్రైవరు.

ఆ మాటలతో అందరూ మౌనంగా ఉండిపోయారు.

## 3

అల్లా హో అగ్బరల్లా... ఇంగేంపనిలేదా ఈళ్లకు. ఇంతపద్దన్నే మైకులు పెట్టుకోని అరస్తాండారు. శ్రీశ్రీనివాసా శ్రీవెంకటేశా... అరెనీ.. మీగ్గూడా తెల్లారిపోయిందంటరా... నిమ్మళంగా పడుకోనీరా... రేత్తిరితాగిందేది ఎప్పుడో దిగిపోయిండాది. దీపావళి దెగ్గిర్లో ఉండాది. పుణ్ణేత్ముడు నాయన... సచ్చిపోయి రెండేండ్లయితాండాది. ఇంతవరకు గుడ్డలు పెట్టలా... నాయన్ను ఎనకంటీ తీసుకోనొచ్చిండాల్సింది. ముసిలినాకొడుకు... తలుసుకుంటాంటే కోపమొస్తాండాది. ఊర్లో వాళ్లబ్బులిబ్బంతా పెట్టినట్టు అట్నించి రానే రానని. వచ్చింటే ఈడ ఉన్నింది తింటా, లేకపోయినా అడక్కతినయినా బతికేసిండచ్చు... నాయన తిండిలేకనే సచ్చిపాయ... నాయనకు బతికుండంగా తిండి పెట్టలేకపోతి... సచ్చినాక గుడ్డలు కూడా రెండేండ్లుగా పెట్టనేలే. అమ్మకు గుడ్డలు పెట్టేది నిలిపేసి ఎన్నేండ్లాయినో... నాదీ ఒగ జన్మేనా... థూ.... తూరుగా వాకిలి ఉండే ఇల్లు తీసుకోవాలంట. నిన్న ఎవురో ఇంటికొచ్చిన బైరాగి చెప్పినాడు... నిజమే... ఉత్తరం వాకిలి అచ్చిరాలా... పల్లెలో ఉన్నింది తూర్పు వాకిలేకదా... పల్లెకు, టౌనుకు జాతకాలు మారతాయేమో... ఏం మారతాండాయి... మారతాయనే ఆశతోనే టౌనుకు వచ్చింది. ఏం లాభం... పల్లెలోనే మేలుగా ఉండె. పస్తుంటే పలకరించే దిక్కయినా ఉండె. ఈడ ఆదీలేదు. అది కూలికి పోతాన్నెప్పుడు బాగనే ఉండె. సెంటర్‌కాడ ఎంతమందో కూలోల్లు.... అన్ని దేశాల నించి నామాదిర్తో వచ్చినోళ్లే... ఆ జెసిబిలు రాకముందు అందరికీ పనుంటాండె. ఇప్పుడు చానామంది పాయమోళ్లే బీటికుండారు. ఈ ముసిల్దానికి పని ఎవరిస్తారు. పాసిపనికి కూడా పనికిరాకుండా అయిపోయిండాది. నా మల్లెమొగ్గ... చెండుమల్లి పువ్వు... ఎంత బాగున్నింది... ఇప్పుడేముండాది... ఎండిన కంప మాదిరిగా ఉండాది. ఆ కంపకు కూడా సక్రమంగా గుడ్డలు లేవు... అడక్కతినేదాని మాదిరిగా ఉండాది...

"ఇంటికి పెద్ద దిక్కనేవోడు పొద్దెక్కిందాకా పొనుకోనుంటే ఎట్లా. లేసి బిన్నే పోతే కదా సెంటర్‌కాడికి. ముందుగా పోతే ఏదన్నా పని దొరకతాది" అంటా వచ్చి శివయ్య కప్పుకోనుండే బొంతను పట్టి లాగింది పార్వతమ్మ.

"నీయమ్మా... లంజిముండా... అరగాసి పనిచేసేది లేదుగానీ మొగోన్ని నిద్రపోనీకుండా సంపతాండావే..." అంటా విసురుగా లేసినాడు శివయ్య. వంట్లో శక్తి లేకపోవడంతో ఆ విసురుకు లేచినవాడు మళ్లీ కూలబడ్డాడు.

"ముసిలోడయితాన్నే రోసానికేం తక్కువలే... కట్టుకొన్నె కాన్నించి ఏ పొద్దు నన్ను కుదురుపెట్టి తిండిపెట్టినావు. పనులుంటే నేనేమన్నా చేయలేదా. లేకనేకదా ఇంటికాడ ఉండేది. బోండాలు ఏద్దామంటే ఈ ఈదిలోనే ఆరేడుతావల పెట్టిండారు. అబ్బుటికి ఇంట్లో కడిచేసి

ఏస్తాండ్లా. గమ్మునుండలేక ఊరవతల పొయ్యేసి దినమ్మూ కంపలు కొట్టుకోనొచ్చి ఏస్తాండ్లా. అన్నం చేసుకునేదానికి మీ అబ్బాకొడుకులు ఏ పొద్దన్నా రూపాయి దుడ్డు పెట్టి కట్టెలు తెచ్చినారా? ఒక కంపకట్టె కొట్టకచ్చినారా?"

"ఆపతావా అడికి" అంటా జారిపోతాండే పంచెను ఎగ కట్టుకుంటా ఇంటి ముందరకొచ్చినాడు. ఇటూ అటూ ఒగసారి చూసినాడు. దారంతో రెండు చోట్ల కుట్టి, ఒక చోట పిన్నీసు పెట్టిండే హవాయి చెప్పులను వేసుకోని వూరవతల కంప చెట్లవైపు పోయినాడు.

ముండమోపి బతుకు... ఎనుములు మేస్తాండాయి... కక్కసులు కట్టించుకోవాలంట..... యాన్నో టివిలో చూసినా. కక్కసుల్లోకి పోకపోతే ఎనుములు, మనుషులు ఒకటేనంట.... కక్కసుల్లేని ఇంటికే నాలుగునూర్లు బాడుగ కడతాండాం. అదుండాలంటే ఆరునూర్లన్నా ఉండాల. నెలకు ఏరగనే రెండు నూర్లు పెట్టాల. దానికి నీళ్లు... తాగేదానికి నీళ్లు దొరికేదే కనాకష్టంగా ఉండాదే... పనులు దొరికేది కష్టంగా ఉండాది. పొద్దు పుట్టకముందే సెంటర్ కాడికి పోయి నిలబడుకుంటే... నిలువుకాళ్లు బడతాయి కానీ పనిదొరకదు.... ముసిలోన్నంట. ఎంతుంటాది. నలభై కూడా ఉండదు వయసు. నేను ముసిలోన్నా... వగిసిలో ఉన్నెప్పుడు ఎట్లున్నే. ఎంత పనిచేస్తాన్నే... కొండ్రె ఎంతబాగా ఏస్తాన్నే... ఈడికొచ్చినాక కూడా ట్రాక్టరు పనికి పోయినా, ఇంటి పనికి పోయినా... ఎంత హుషారుగా ఉంటాన్నే... ఇప్పుడేమయింది. తాగేది తగ్గించుకోనుంటే ఆరోగ్యం బాగనే ఉండు కదా. ఎర్రమందు అగ్గవకు వస్తాంటే తాక్కుండా ఎట్లుంటాం. రైలుగేటుకాడ లంజలు పదికి ఐదుకు వస్తాంటే పోకుండా ఎట్లుండేది? అందుకే వంట్లో బాగలేకుండా పోయిండేది.

పెద్దకూతతో రైలు పోయింది.

గబగబా ఇంటికి వచ్చినాడు శివయ్య. పండ్లపొడి అరిచేతిలో వేసుకొని బ్రష్‌తో పళ్లు తోమి స్నానానికి వెళ్లినాడు. బకెట్‌లో చేయిపెట్టి చూసి "ఏమేయ్... చన్నీళ్లే పెట్టిండావే. ఉడుకు నీళ్లు పెట్టు" అనరిచాడు కోపంగా.

"ఉడుకు నీళ్లు లేవు. ఇంగనించి చన్నీళ్లే అందరికీ. కంపకట్టెలు కూడా అందురూ కొట్టుకోని పోతాండారు. సుట్టుపక్కలా దెగ్గిరిలో యాడాలేవు. మీరు ఒగదినం కూడా గబ్బునీళ్లు తెచ్చింది లేదు. అందరిండ్లల్లో గ్యాసుండాది. మనకా రాత యాడుండాదిలే" అంది యాష్టపోతా పార్వతమ్మ.

"చలికి ఎట్లనే చన్నీళ్లు పోసుకునేది" అంటా నసుగుతా అక్కడే నిల్చున్నాడు. ఎంతకూ భార్య వేడినీళ్లు తేకపోవడంతో చన్నీళ్ల స్నానమే చేసి వచ్చినాడు. భర్తకు గ్లాసులో సద్ది పోసిచ్చింది.

"చలికి సద్ది ఏం తాగతానే... టిఫనుతేపో"

"దుడ్డు యాడుంది... సద్ది తాగు"

"టిఫనంగట్లో అప్పు తేపో"

"ఇప్పుటికే అబ్బాకొడుకులు కలిసి నాస్టా అంగట్లో యాభైరెండు రూపాయలు అప్పు చేసిండారు. ఆ పక్కకు పోతే చాలు అయమ్మ దుడ్డు అడగతాండాది. నువ్వే పోయి తినుపో. నేనడగను అప్పు."

"మనమేమన్నా ఊరొదిలి పోతాండామా... సరేలే సద్దిగ్లాసీ... వాడేడ"

"తెల్లారేలకు యాడబోయినాడో... ఒగడేమో దేశాలు పట్టిపోయినాడు... ఈడేమో సదువుకూ కాకుండా పోతాండాడు. ఏ పనీ నేర్చుకోలా..."

"ఈసారి ఇంటరు పాసు కాకపోతే వోన్ని కూడా నాతో పాటు పనికి పిల్చుకోనిపోతా... బాగా చదువుకోరా నాకొడకా... మా మాదిరిగా కష్టం చేయలేవు అంటే వాడికి మతికి ఎక్కతాంటే కదా... దీపావళికి టపాసులు కావాలంట మళ్లా వాడికి"

"మీ అమ్మానాయనకు గుడ్డలే పెట్టలా. వోనికి కూడా చినిగి పోయిండాయి గుడ్డలు" అంది పార్వతమ్మ.

"ఈపొద్దు శనారం కదా... ఈవారమంతా మూడు రోజులే పని దొరికింది. అప్పుడే, యాభై రూపాయలు ఇచ్చేసినాడు. ఇంగ నూర్రూపాయలు రావాలంతే. వచ్చేవారమన్నా పని దొరికితే పాతగుడ్డలు రెండు జతలు తెస్తావోనికీ నీకూ" అన్నాడు శివయ్య.

పార్వతమ్మ క్యారేజీలో అన్నం పెట్టి, చింతపండు పచ్చడి వేసి భర్త చేతికి యిచ్చింది. తుండు గుడ్డను భుజాన వేసుకుని క్యారేజీని చేతపట్టుకుని కాళ్లీడ్చుకుంటా నడవసాగినాడు శివయ్య.

ఎన్నెన్ని రంగుల బొమ్మలు. సిన్మాలు చూసి ఎన్ని రోజులయితాండాది. ఎంగటేస్పర సినిమాలో బిత్తల సినిమాలు ఏస్తారు. అయ్యి చూస్తాంటే ఎంత బాగుంటాదో. ఆ కర్రిది ముసిల్ది అయిపోయింది. అట్లాంటియుంటే క్ప్... ఆడపోతాండాది. గజ్జెల గుర్రం మాదిరిగా ఉండాది. ఊర్లో ఉండాడో లేడో మేస్త్రీ... ఇంగా కూలి దుడ్డు నూరు రూపాయలు ఈవాల. ఈ రోజు ఏ పని దొరుకుతాదో... సులపాగా ఉండే పని ఉంటే బాగుండు. పెద్దగా బరువులు ఎత్తలేకుండా ఉండా.

సెంటర్‌కాడికి చేరుకున్నాడు శివయ్య. అప్పటికే అక్కడ వందమందిదాకా పనికోసరం కాసుకోనుండారు. వాళ్లతో జతకలిసినాడు. పదిగంటలు అవుతున్నా శివయ్యకు కూలీ దొరకలా.

"ఏమన్నా... ఏవూరు మనది".

"మాది పీలేరవతల. మారేళ్ల."

"అరే..... మాదికూడా ఆపక్కనే కమ్మారపల్లె. ఎన్నేండ్లయింది ఈ ఊరొచ్చి".

"ఐదేండ్లయితాండాది. పనులే లేవు"

"యింగా యాదుండాయిన్నా మనట్లా వోళ్లకు పనులు. అన్ని పనులూ మిషన్లు చేస్తాంటే మనసలకు పనులెందుకుంటాయి? నేను కూడా మీ మాదిరిగా ముందు కూలి పనులే చేస్తాంటి. ఇట్ల కాదని రిక్షా తొక్కతాండా. టౌనులో వోళ్లు దుడ్డు లెక్క చెయ్యరు. యాడికి పోవాలన్నా రిక్షాలోనే కదా పోతారు. సమచ్చురం నుంచి నేను రిక్షా తోలతాండా. ఏదో ఫర్వాలేదు. నువ్వు కూడా రిక్షా తోలకూడదా".

"నేనా... నాకు రిక్షా తొక్కేది రాదే. రిక్షా కావాలంటే దుడ్డ కావద్దా."

"రిక్షా తొక్కేది ఏం పెద్ద కష్టం కాదు. కొంచెం బేలన్సు పట్టాలంతే. నేను నేర్పిస్తాలే. మా మేస్త్రీ తావన పది రిక్షాలుండాయి. ఆయనతో చెప్పి బాడుక్కు యిప్పిస్తా. తోలుకో. రోజుకు రిక్షా బాడుగ పదైదు రూపాయలు. నీకు ఎట్ల లేదన్నే డెబ్బై ఎనబై మిగలతాది"

## 4

దరిద్రం గొట్టుది... సైరను పద్దన్నే ఐదోగంటకంతా కుయ్... మంటా కూతేస్తాది. మున్సిపాల్టి నాయాండ్లకు నిద్దర రాదేమో... బంగారట్లా నిద్దర చెడగొట్టేస్తాండారు దినమ్మా. ఈడ ఒద్దే ఇల్లు అంటి. ఇంటే కదా అది. బాడుగలు తక్కువ అని చేరె. ఒగటే సంత... అందురూ లేసేసినట్టుండారు. అడక్కతినే నాయాండ్లు. ఇంత పద్దన్నే ఎందుకు లేసేస్తారో. అదింగా లేసినట్టులేదే. ముందే కంప మాదిరిగా ఉన్నింది. ఇప్పుడింగా ఒట్టి చేపమాదిరిగా అయిపోయిండాది. ఉప్పుకారం బెట్టి ఏంచుకోని తినేస్తే.. ఎంకలు తప్ప ఏముండాయిలే. ఎన్నాళ్లయిందో కరువాళ్లు తిని. తాటాకు చేపలు మార్కెట్లో ఉండాయి. దొంగలంజ... అది రెండు చేపలు పది రూపాయలు చెప్తాండాది. పక్కూర్లో సంతకు పోతే అగ్గవంట. ఆడికి పోవాలంటే ఆరుమైల్లు రిక్షా తొక్కోని పోవాల. లేదంటే పోనురాను ఎనిమిది రూపాయలు చార్జీ పెట్టుకోని బస్సుకు పోవాల. ఎనిమిది రూపాయలుంటే... దానికి ఇంగో ఎనిమిది రూపాయలు ఎగేస్తే.... ఎర్రమందు మూడొస్తాది. ఏసుకోని పొనుకుంటే ఎంత సమ్మగా ఉంటాదో... ఎర్రమందులోకి ఎండు చేపలు ఏంచుకోని సంజుకోని తినాల్సిందే. దానిగ్గూడా ఎండు చేపలంటే ఎంతిష్టమో... అడిగి చాన్నాళ్లాయ. పది రూపాయలు పెట్టి కొనలేక పోతాండానే.... పార్టీలు కూడా పోతాండారే... ఆటోల కల్లానే ఎగచూస్తాండారు. రిక్షాకు బ్రేకులు సరిగా పడవు. రిపేరు చేయించుకుంటే ఓనరు దుడ్డు ఈడు. రిపేరు చేయించకుంటే జోరుగా తొక్కలేం. టకామని ఏదన్నా అడ్డమొస్తే... ఒకసారి కారును గుద్దేసి ముందు చక్రం ఒంగి పోయింది.

"సైరను అరస్తాంది. ఈయరవదాంకా ముడుక్కోని పడుకోకుంటే లేస్తేనేం. వోడు

చూస్తే అట్ల. నువ్వు చూస్తే ఇట్ల... నాకే గన శక్తి ఉన్నింటేనా... నేనే పొయ్యిందు రిక్షా తొక్కేదానికి. నువ్వన్నా లేపరా మీ నాయన్ను"

"మ్మో.... గమ్మున పడుకో ఏమీ... తెల్లారనీలే... అర్ధరాత్రి కాన్నించి పెద్ద నసగా ఉండాదే నీది. నిద్రరాదా నీకు" అన్నాడు కొడుకు ముసుగు తీకుండానే.

"పద్దన్నే రైలు బండ్లు వస్తాయి. బస్టాండుకు పొయ్యేవాళ్లుంటారు. ఇప్పుడే కద గిరాకీలు ఎక్కువగా ఉండేది. పొగులంతా కాసుకోనున్నే ఒగ బాడిగ కూడా రాదు. ఇప్పుడు పోతే ఎండ పడక ముందే నాలుగైదు బాడిగలు తోలుకోవచ్చు. తెల్లారినాక పోయేది. ఎండన బాడిగలు రాలేదని చెప్పేది. వచ్చిన దుడ్డంతా తాగేసి వచ్చేది" అంటానే ఖణేల్ ఖణేల్ మంటూ దగ్గింది పార్వతమ్మ.

"ముసిలి లంజా... నీకు చావన్నా రాలేదే. మమ్మల్ను నిమ్మళంగా ఉండనిచ్చేటిగా లేవే" అంటా ఒక్కదుటున లేచి వచ్చి పడుకోనుండే భార్యను ఎగిసెగిసి తన్నినాడు శివయ్య.

"అమ్మో.... నాయనా.... ముండనాబట్టా... నీ కాళ్లిరగా... తెల్లారేలకు నీకేం పోగాలం వచ్చింది. నీ కాళ్లు పడిపోను. ముసిల్దాన్ని ఇంట్లో అంత వండేస్తాంటే నన్నే తంతావా. సంపాదించిందంతా నీకు తాగేదానికి చాలకపోతే అడా ఈడా అడక్కచ్చి పెడతాండా... ఆ కనికరం కూడా లేదా నీకు.... నీ చేతులిరగా" అంటా ఏడుపెత్తుకునింది పార్వతమ్మ.

"థూత్.... ఈ ముసిలోల్లు ఎప్పుడూ ఇంతే" అంటా కొడుకు బయటెళ్లిపోయినాడు.

శివయ్య పక్కనే శ్మశానంలో ఉండే కంపచెట్లల్లోకి పోయినాడు.

దొంగ ముండ.... నేనంటే కొంచెం కూడా లెక్కా జమాలేదు. ఎంతమాటంటే అంతమాటంటాది. అడక్కదినే లంజ.... నన్నే ఎదిరించి మాట్లాడతాదా. నాకు తెలీదా పద్దన్నే పొయ్యేది. రేతిరి బిత్తల సినిమా చూసి వచ్చినా. దాని ఒంటిమింద చెయ్యి ఏస్తే ఇసిరి కొట్టింది. ఎంచేపు నిద్రేరాలా. రైలుగేటుకాడికి పోదామంటే దుడ్డులే. పద్దన్నే నిద్ర పడతాంటే లేపేస్తాదా... చంపిపారదెంగతా... ఏమనుకుంటాండాదో ఏమో.... వానేలీ.... రిక్షా బాడుగ దుడ్డు ఈ పొద్దు ఇచ్చేయాలంట. నెలదినాలది ఇయ్యాల. ఈకుంటే ఏం చేస్తాడో. పెరకతాడా.... ఏముండాయి పెరుక్కొనేదానికి... బంగేకు దమ్ము పెరికి ఎన్నేండ్లయితాండాదో... పదేండ్లమించి రిక్షా తొక్కతాండా.... ఒగనెల ఈకుంటే ఏం....

లారీ పెద్దగా హారన్‌తో వెళ్లింది.

శివయ్య ఇంటికి వచ్చినాడు. నోట్లో నీళ్లు పోసుకొని పుక్కిలించి ఉంచినాడు.

"తొట్లో నీళ్లు పొయ్యి"

"ఆc.... ఇంగేమొద్దా... తాగేదానికి నీళ్లు లేవు. ఈ మహరాజుకు పోసుకునేదానికి నీళ్లు కావాలంట నీళ్లు".

"నీయ.... పద్దన్నే నా దగ్గర ఎందుకే దెంగులు తింటావు గబ్బు ముండా" అంటా భార్య దగ్గరకు వచ్చినాడు. మళ్లీ ఏమనుకున్నాడో ఏమో "నీకత యిప్పుడు కాదు. మద్దేనం వచ్చి చెప్తా" అంటా ఇంటి ముందు నిలబెట్టిండే రిక్షాను తీసుకోని వెళ్లిపోయినాడు. దారిలో ఎన్నో రిక్షాలు... అక్కడక్కడా ఆటోలు. నేరుగా బస్టాండు వద్దకు చేరుకున్నాడు. వచ్చి పోయే జనాల చూస్తాండాడు. ఎవరైనా బ్యాగులతో కనిపిస్తే "రండిసార్... యాడికి పోవాలసార్" అంటాండాడు. శివయ్యను పట్టించుకోకుండా పోతే మనసులో తిట్టుకుంటాండాడు. యింతలో ఒకలావుపాటి ఆయన వచ్చినాడు.

"రండి సార్.... రండి"

"తిలక్ రోడ్డుకు వస్తావా"

"ఎక్కండి సార్"

"నిన్ను కాదయ్యా నేనడిగింది. నువ్వే ఊపిరి పొయ్యేవోనిమాదిరిగా ఉండావే. నువ్వేం తొక్కతావు రిక్షా. అంతా మిట్టే కదా. ఆటోలో పోతాలే"

"తొక్కతాను రాండి సార్"

అతను ఆటోలో వెళ్లిపోయాడు.

చుట్టుపక్కల మనుషుల పరిశీలనగా చూస్తా నిలబడుకోనుండాడు. ఇద్దరు మాట్లాడుకుంటా పోతాండారు.

"మా పిల్లోనితో పెద్ద పోరయిపోయిండాదిన్నా.... వోనికి స్కూటర్ కావాలంట"

"ఏం చేస్తాం.... కనుక్కొన్నేక తప్పుతాదా... మా వోనికి హీరోహోండా కావాలంట. పదైదు ఇరవై వేలల్లో ఏదన్నా చిన్నబండి తీసుకోరా అంటే ఇనలా వాడు. ఇరవైవేలు అప్పు చేసి యాభైవేలు పెట్టి కొత్త బండి కొనిచ్చినా"

వాళ్ల పక్కకు పోయి "రిక్షా సార్" అన్నాడు శివయ్య. అతన్ని పట్టించుకోలేదు వాళ్లు. వచ్చిపోయే జనాలవైపు కోపంగా, ఆశగా చూస్తా నిలబడుకోనుండాడు.

"ఈ వూరంతా సిమెంటు రోడ్లు ఏస్తాండారు. అన్ని రోడ్లూ రెడీ అయిపోయినాయంటే మళ్ల మనపని మేలు"

"ఔను... మళ్ల ఎవ్వరేకానీ రిక్షాల తిక్కు చూడరు. అందురూ ఆటోలే ఎక్కతారు".

"మీటర్ పెడతారంట కదా"

"పెట్టనీలే... రోడ్లు బాగున్నెప్పుడు ఇబ్బందేముండాది. చిత్తూరులో అయితే అన్నీ ఆటోలేగదా. అదేదో ఊరు చెప్పినారు. ఆడయితే రిక్షానే కనపడదంట. జనం సుఖం మరగతాండారు. బిన్నే ఎల్లిపోవాల, దుడ్డు ఎక్కువయినా ఫర్వాలేదనుకుంటాండారు."

## 5

ఈనాకొడుకు యాడుండాడో. దప్పికగా ఉండాది. ఇంట్లో గ్లాసు నీళ్లు కూడా లేవు. బిందెతో తెచ్చుకునే శక్తి కూడా లేదు. వోడు నిన్న పద్దన్నే పోయినాడు ఆటోకు పాతాండానని. ఆడేన్నో యాక్సిడెంటయిందన్నేరు. వోనికి ఏం కాలేదంట. బండికి దుడ్డు ఈన్నే కట్టమన్నేరంట. ఏం చేస్తాండాడో ఏమో. చిలక్కు చెప్పినట్టు చెప్పినా. యాడన్నా ఓటల్లో కుదురుకోరా తిండికి జరిగిపోతాది. కూటికి ఉంటే కోటికున్నెట్టు అని. వోడు ఇంటే కదా. ముసిలిముండ... ఉన్నింటే బాగుండు. యేలకు అన్నీ చేసి పెడతాండె. అది సచ్చిపోయి ఐదేండ్లయితాండాది. అప్పట్నించి సరిగా తిండిలే. తిండిదేముండాదిలే.... ఎర్రమందు తాగి ఎన్నాళ్లయిందో. ఇంతకు ముందు వోడు ఇంటికి తెస్తాండె. నా ముద్దుల కొడుకు. ఈ మద్దెన తేవడంలే. వోనికీ గిరాకీలు ఎక్కవ రావడంలేదంట. ఆటోలు ఎక్కువయినాయంట. టాక్సీలు వచ్చినాయంట. దిగులు పడతాండాడు. ఆకలిగా ఉండాది. అన్నం తిని రెండు రోజులయిందాది. ఎన్ని రోజులయితే ఏముండాదిలే. తాగేదానికి మందన్నా ఉంటే బాగుండు. బిత్తల సినిమాకు పోయి చాన్నాళ్లయిపాయ. అదుంటే నెలకొగసారన్నా ఉంటాండె.... ఆ ముండమోపి ముందుగా ఎందుకు సచ్చిపోవాల. నా పారూ.... నేను దేవదాసునయిపోయినా..... తాగేదానికి మందుకూడా లేదే...

"భౌ..... భౌ..." ఇంటి ముందర కుక్కలు మొరిగినాయి.

గుడిశెలోనించి బయటకు వచ్చినాడు. నడవలేకుండా ఉండాడు. రెండో ఆట సినిమా వదిలినారేమో. రోడ్డుమీద జనం మాట్లాడుకుంటా పోతాండారు.

బస్టాండు వైపు అడుగులు వేసినాడు ఎముకల గూడులా ఉండే యాభై ఐదేళ్ల శివయ్య.

ఎవరన్నా ఒగ యాత్రికుడు దొరికినా... లాడ్జిలో రూములో చేరిస్తే కమీషను వస్తాది. లాడ్జీకాడికి పోయి యాబయి రూపాయలడిగితే. ఇప్పటికే నూర్రూపాయలివ్వాల. ఆ దుడ్డు కట్టమంటారు. ఆ లంజనడిగితే.... దానిక్కూడా ముప్పైరూపాయలు బాకీ.... ఆడికీ గిరాకీలు ఎవురూ రాలా.... ఈ పొద్దు ఎట్లన్నా గానీ లాడ్జికి గిరాకీని పట్టక పోవాల. ఎవుడో సూటూ బూటూ ఏసుకోనుండాడు. ఇట్లే వస్తాండాడు.

"రూము కావాలా సార్... రూము"

మాట్లాడకుండా పోతాండాడు

"సిలక కావాలా సార్... సిలకా... బంగారట్లా"

వంచిన తల ఎత్తనే లే. కొజ్జానాకొడుకు.

కాళ్లు గుంజతాండాయి. కుచ్చొంటే... ఎంచేపు...

"ఎవర్రా నువ్వు" పోలీసు.

"నన్ను మామూలుగా చూస్తానే ఉండారు కదా దేవరా... ముసిలినాకొడుకును. ఏం పనీ చేయలేను. ఎవరన్నా పార్టీలు వస్తే లాడ్జిలో రూములు మాట్లాడ్తాండాను"

"యాబయి రూపాయలీ"

"నాదెగ్గిర లేదు దేవరా...'

"తేరా..." అంటా వచ్చి చిరుగుల సొక్కాయి జేబులో చేయి పెట్టి చూసినాడు పోలీసు. అందులో ఏవో పాత పేపర్లు రెండు కనిపించాయంతే. పంచను పట్టి లాగినాడు. బిత్తలతో నిలబడిపోయినాడు శివయ్య.

"థూ.... ముండమోపినాయాల... కట్టుకో లుంగీ".

"నేను ముందే చెప్పినా కదా దేవరా.... నా దెగ్గిర ఏమీ లేదని." అని ఏడ్వలేక నవ్వతా లుంగీని కట్టుకున్నేడు.

"ఎవరన్నా వస్తే దుడ్డు నాకీ. నేనా పక్కన పడుకోనుంటా" అని చెప్పి వెళ్లిపోయాడా పోలీసు.

థూ... నీయమ్మా.... నీకేంబాకీరా లమ్డీ నాకొడకా... అడ్డమైన గాడిదకొడుకులకంతా దుడ్డు ఇవ్వాల. నేనేమో కోట్లు సంపాదిస్తాన్నెట్టు. ఆకలి ఈ రోజు సంపేస్తాండాది. ఎంచేపు నిలబడుకున్నే ఎవ్వరూ రారే... బస్టాండులో నీళ్లన్నా తాగితే... ఎన్ని రోజులు నీళ్లు తాగి ఉండేది.

బస్టాండులోపలికి పోయి తాగునీరు అనే బోర్డు ఉండే దగ్గర నీళ్లు తాగినాడు. చేతులను మూతిని తుండుగుడ్డతో తుడుచుకుంటా బస్టాండులో ఉండే జనాన్ని పరిశీలనగా చూసినాడు. ఒకతని బెంచీమీదే కుచ్చోనీ నిద్రపోతాండాడు. పర్సు బయటకు కనిపిస్తాంది.

దాన్ని తీసుకుంటే... అమ్మో... ఇంతవరకు దొంగతనం చేయలా... తార్పుడు పని దొంగతనం కన్నా మంచిదా... కడుపు నిండాల. ఏ పనయితే ఏం... అంతేనా... అంతేనా...?

అరుణతార, డిసెంబర్ 2004